పింఛన్ కష్టాలు మొదలు

- ఇంటింటికీ పింఛన్ల పంపిణీలో ప్రభుత్వం విఫలం
- లబ్ధిదారులతో పాటు సచివాలయ సిబ్బందికీ తప్పని అవస్థలు



వెంకోజీపాలెంలో రామాలయంలో పెన్షన్ కోసం క్యూలో నిల్చున్న వృద్ధులు

ఆరిలోవ : ఇంటింటికీ పింఛన్ల పంపిణీలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పేరుతో లబ్ధిదారులకు నగదు పంపిణీలో తొలిరోజు సోమవారం చతికిలపడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్కో వలంటీరు 50 ఇళ్లకు వెళ్లి పింఛన్ల పంపిణీని వేకువజామునే పూర్తి చేసేవారు. ఇంటి తలుపు తట్టి లబ్ధిదారులకు నేరుగా నగదు అందించేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వలంటీర్లను కాదని సచివాలయ సిబ్బందితో పంపిణీ చేస్తామని బీరాలు పలికి లబ్ధిదారులతో పాటు సచివాలయ సిబ్బందికి కూడా చుక్కలు చూపించింది. కూటమి నాయకుల హడావిడి తప్ప లక్ష్యం పూర్తిగా నెరవేరలేదు.

తూర్పు నియోజకవర్గంలో సామాజిక పింఛన్ పంపిణీ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. దీంతో సచివాలయం సిబ్బంది తెల్లవారుజామునే విధులకు హాజరయ్యారు. మొదటి రోజే 95 శాతానికి పైగా పింఛన్ల పంపిణీ చేస్తామని ముందు నుంచే కూటమి నాయకులు ఊదరగొట్టారు. అయితే పింఛన్ల పంపిణీ కొన్నిచోట్ల 70 శాతం కూడా దాటకపోవడంతో ఆ నాయకులు కంగుతిన్నారు. సర్వర్ మొరాయించడంతో పలు చోట్ల పింఛన్ల పంపిణీ ఆలస్యమైంది. దీంతో డబ్బులు ఇస్తారో.. ఇవ్వరో.. అంటూ వృద్ధులు, వికలాంగులు ఎదురుచూశారు. కొంత మంది లబ్ధిదారులు తమ కుటుంబ సభ్యులను తోడు తీసుకొని సచివాలయాలకు చేరుకున్నారు. అక్కడ సచివాలయం సిబ్బంది లేకపోవడంతో ఈసురోమంటూ తిరిగి ఇంటి ముఖం పట్టారు. సర్వర్ గంటల తరబడి పని చేయకపోవడంతో సచివాలయం సిబ్బంది కూడా నానా అవస్థలు పడ్డారు. సచివాలయం సిబ్బంది ఎప్పుడు వస్తారోనని లబ్ధిదారులు తమ ఇంటి వద్ద ఆశతో ఎదురుచూశారు. గతంలో వలంటీరు వచ్చి తెల్లవారే సరికి ఇంటికి వచ్చి డబ్బులు ఇచ్చేవారని, ఇప్పుడు రోజంతా ఎదురుచూడాల్సి వచ్చిందని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు దర్జాగా సచివాలయం కార్యాలయంలో కూర్చొని పని చేసిన సిబ్బంది ఉదయం 6 నుంచి రాత్రి వరకు పని చేయడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు.



ఎంవీపీ ఆదర్శనగర్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న పట్టాభి, తదితరులు



వెంకోజీపాలెంలో క్యూలో పెన్షన్‌లు అందిస్తున్న టీడీపీ నాయకులు

క్యూలో నిల్చోబెట్టి పంపిణీ

మద్దిలపాలెం : పండుటాకులు పెన్షన్ కోసం పరుగులు తీశారు. గత ప్రభుత్వ హయాంలో ఎంచక్కా ఇంటి వద్ద కోడికూతతో పెన్షన్ తీసుకునే వృద్ధులు ఈ సారి పడరాని పాట్లు పడ్డారు. ఇంటికి వచ్చి ఇస్తారా?.. లేక సచివాలయాలకు వెళ్లాలో తెలియక తెల్లారింది మొదలు పెన్షన్ కోసం తీసుకోవడానికి పడరాని పాట్లు పడ్డారు. కూటమి నాయకుల, సచివాలయ సిబ్బంది కొందరు సచివాలయాలకు రావాలని, మరికొందరు ఆలయాల వద్దకు రావాలంటూ చెప్పడంతో లబ్ధిదారులు తికమకకు గురయ్యారు. సోమవారం తెల్లవారుజాము నుంచి వర్షం కురవడంతో పెన్షన్ కోసం తడుస్తూ ఇసురోమంటూ పరుగులు తీశారు. వెంకోజీపాలెంలో రామాలయం వద్దకు లబ్ధిదారులు రావాలంటూ పిలుపునిచ్చారు. అక్కడ వృద్ధులు, వికలాంగులు, వితంతవులను క్యూలో నిల్చోబెట్టి పెన్షన్లు పంపిణీ చేశారు.



పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లిన వృద్ధురాలిని ఇంటికి తీసుకెళ్తున్న బంధువు

ఆరిలోవ: ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు జోడుగుళ్లపాలెం, ఆరిలోవ ప్రాంతాలలో సచివాలయం సిబ్బందితో కలిసి సామాజిక పింఛన్ల డబ్బులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వెళ్లిన కొన్ని చోట్ల సర్వర్ పని చేయలేదు. దీంతో లబ్ధిదారులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కార్యక్రమంలో 9, 10, 11, 1, 13 వార్డుల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: స్థానిక ఆదర్శనగర్‌లో కూటమి నేతల ఆధ్వర్యంలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పలువురు వృద్ధులు, వికలాంగులు, వితంతువుల ఇళ్లకు వెళ్లి సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చోడే పట్టాభిరామ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలి

మద్దిలపాలెం : ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలని రాష్ట్ర రోడ్డు రవాణా, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ నాయకులు కోరారు. మద్దిలపాలెంలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రిని యూనియన్ నాయకులు కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ రాష్ట్ర కోశాధికారి పి.వి.వి.మోహన్, జోనల్ కార్యదర్శి ఎం.వి.ఆర్.మూర్తి, రీజనల్ కార్యదర్శి బి.నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు అందింది. కర్రి అఖిల అనే బాలిక విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని ఎంజేపీ స్కూల్ హాస్టల్‌లో ఉంటూ 9వ తరగతి చదువుకుంటుంది. తల్లి దండ్రులు కైలాసపురం సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ ఎదురుగా నీలకంఠ నగర్‌లో నివసిస్తున్నారు. బాలిక వేసవి సెలవలకు తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. జూన్ 13న వేసవి సెలవలు ముగిసినా అనారోగ్యం కారణంగా ఆ సమయానికి హాస్టల్‌కు వెళ్లలేదు. గత 29న వెళ్లేందుకు సిద్ధమైంది. కుమార్తెను దింపేందుకు తల్లి స్నానానికి వెళ్లి తిరిగి వచ్చి చూసేసరికి అఖిల ఇంట్లో కనిపించలేదు. చుట్టు పక్కల అంతటా వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో అఖిల తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. హెడ్ కానిస్టేబుల్ రమణ కేసు దర్యాప్తు చేపట్టారు. ఇంట్లో నుంచి వెళ్లే సమయానికి బాలిక ఆకుపచ్చ రంగు ప్యాంట్, టాప్ ధరించి ఉంది. నాలుగున్నర అడుగుల ఎత్తు, తెలుపు రంగు చాయ కలిగి, మెడలో తాయత్తు, కాళ్లకు పట్టీలు ఉన్నాయి. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

క్లుప్తంగా

జన్యుపర వ్యాధులపై పరిశోధన



జన్యు పరిశోధన చేస్తున్న ఎల్వీపీ వైద్యులు

ఆరిలోవ: జన్యుపరమైన వ్యాధులకు సంబంధించి చికిత్స కోసం తమ ఆస్పత్రి వైద్యులు పరిశోధన చేసినట్లు విశాఖ ఎల్వీపీ కంటి ఆస్పత్రి పీఆర్ హెడ్ కె.అనిత సోమవారం తెలిపారు. న్యూఢిల్లీలో కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటిగ్రేటివ్ బయాలజితో పాటు హైదరాబాద్‌లో ఎల్వీపీ నేత్ర విజ్ఞాన సంస్థ కూడా పరిశోధనల్లో పాల్గొందన్నారు. సమర్థవంతమైన జన్యు సవరణ సాధనాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. డాక్టర్ ఇందుమతి మారియప్పన్ ఆధ్వర్యంలో ఎల్వీపీ నేత్ర విజ్ఞాన సంస్థ పరిశోధకులు కొత్త సాధనాన్ని కనుగొన్నారన్నారు. చిన్న వయసులోనే తీవ్రమైన దృష్టి లోపానికి దారితీసే 'లెబర్స్ కాంజినీటల్ అమౌరోసిస్ టైప్–2'అనే అరుదైన జన్యుపర కంటి వ్యాధి ఉన్న రోగి నుంచి సేకరించిన కణాలతో పరిశోధన జరిపినట్లు తెలిపారు.

కుటుంబ సభ్యుల చెంతకు మహిళ



లక్ష్మిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

అల్లిపురం: రైల్వే స్టేషన్లో భిక్షాటన చేసుకుంటున్న మహిళకు ఆశ్రయం కల్పించడంతో పాటు కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు ఏయూటీడీ సిబ్బంది. వివరాలివి.. లక్ష్మి అనే మహిళ రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేసుకోవడంతో ఆమెను ఆర్పీఎఫ్ పోలీసులు, ఏయూటీడీ సిబ్బంది సంరక్షించి, ఇటీవల టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ జీవీఎంసీ షెల్టర్‌లో వసతి కల్పించారు. ఆమె నుంచి వివరాలు తెలుసుకున్న ఏయుటీడీ కార్యదర్శి ప్రగడ వాసు పద్మనాభం మండలంలోని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మళ్లీ ఇంటి నుంచి ఎక్కడికీ వెళ్లకుండా కట్టడి చేయాలని ఆమె కుటుంబ సభ్యులకు సూచించారు.

కేజీహెచ్‌లో సెక్యూరిటీ గార్డుల ఆందోళన

మహారాణిపేట : కేజీహెచ్‌లో ముగ్గురు సెక్యూరిటీ సూపర్‌వైజర్లను వివిధ ఆస్పత్రులకు బదిలీ చేయడంతో సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లు సోమవారం నిరశన వ్యక్తం చేశారు. వివిధ ఆరోపణలపై ముగ్గురు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు శ్రీకాంత్, రామకృష్ణ, శ్రీనివాస్‌ను నగరంలోని వివిధ ఆస్పత్రులకు బదిలీ చేశారు. ఇందుకు నిరసనగా సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

పిల్లల చర్మ రక్షణపై అప్రమత్తత అవసరం

బీచ్ రోడ్డు: వర్షా కాలం ప్రారంభంతో వేసవి ఉక్కపోత నుంచి చాలా ఉపశమనం పొందినప్పటికీ ఇది పిల్లల చర్మ రక్షణకు సవాలుగా మారుతుందని డాక్టర్ శిల్పావోరా అన్నారు. సీజనల్ వ్యాధులు.. పిల్లల ఆరోగ్య సంరక్షణ అనే అంశంపై నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో పెరిగిన తేమ, తడిదనం వల్ల పిల్లల రోగ నిరోధక శక్తిని తగ్గించడమే కాకుండా దద్దుర్లు, చర్మం ఎరుపెక్కడం వంటి సమస్యలు వస్తాయన్నారు. ఇందు కోసం వర్జిన్ కొబ్బరి నూనెతో తయారీ చేసిన బేబీ కేర్ ఉత్పత్తులను వినియోగించాలని సూచించారు.

ఓం ఫ్రీ యోగా వ్యవస్థాపకుడు రమేష్‌కు గౌరవ డాక్టరేట్

ఎంవీపీ కాలనీ: ఓం ఫ్రీ యోగా సెంటర్ వ్యవస్థాపకుడు చిలకా వెంకట రమేష్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. యోగాలో చేస్తున్న విస్తృత సేవలకుగాను న్యూఢిల్లీకి చెందిన సోక్రటీస్ సోషల్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఆ యూనివర్సిటీ వార్షికోత్సవంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నట్లు పేర్కొన్నారు. ఈ గౌరవ డాక్టరేట్ లభించడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఓం ఫ్రీ యోగా సెంటర్‌కు 'యోగాసనా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్' లభించిందన్నారు. గత 11 ఏళ్లుగా విశాఖ వాసులకు యోగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. యూట్యూబ్‌తో పాటు ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా కూడా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. డాక్టరేట్ అందుకున్న రమేష్‌కు పలువురు నగర ప్రముఖులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేశారు.



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న రమేష్

కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పార్చన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. లేదా ఈ–మెయిల్ ఐడీ endow-eokanaka@gov.in ద్వారా తెలుసుకోవచ్చు.

కళా సౌరభం.. సురభి నాటకం



లవకుశ నాటకంలో ఓ సన్నివేశం



సురభి నాటక ప్రదర్శన ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు

మద్దిలపాలెం : తరతరాలకు చెరగని తీపి జ్ఞాపక పరిజ్ఞానం సురభి నాటక సౌరభమని నంది అవార్డు గ్రహీత డాక్టర్ మీగడ రామలింగస్వామి అన్నారు. పద్మశ్రీ బాబ్జీ తన నైపుణ్యంతో నేటి తరాలకు అందిస్తున్న అద్భుతం కళాఖండమని కొనియాడారు. సురభి నాటక ప్రదర్శనల్లో భాగంగా సోమవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో లవకుశ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న అద్భుతాన్ని నేటి తరానికి అందించడానికి ప్రతి ఏడాదీ బాదంగీర్ సాయి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బాదంగీర్ సాయి మాట్లాడుతూ రంగసాయి నాటక సంఘం పద్మశ్రీ బాబ్జీ పేరిట జీవన సాఫల్య పురస్కారాన్ని నాటక రంగ ప్రముఖులకు అందించనున్నామని ప్రకటించారు.

- లవకుశ నాటకం ఆద్యంతం ప్రేక్షకులు హృదయాలను రంజింపజేసింది. శ్రీరాముడి పట్టాభిషేకంతో ప్రారంభమైన నాటకం.. శ్రీరాముడు అయోధ్య రాజ్యాన్ని శాంతియుతంగా పరిపాలిస్తున్న తీరును చక్కని సన్నివేశాల నడుమ ప్రదర్శించారు. లవకుశల పాత్రల్లో కళాకారులు రక్తికట్టించారు. ప్రేక్షకులు తమ కరతాళ ధ్వనులతో నీరజనాలు పలికారు.

వైద్యుల సేవలు అమూల్యం

- జిల్లా మానసిక ఆరోగ్య సమీక్ష బోర్డ్ ఛైర్‌పర్సన్ రామారావు
- ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు



ప్రభుత్వ మానసిక వైద్యశాలలో కేక్ కట్ చేస్తున్న రామారావు, చిత్రంలో డాక్టర్ కె.వి.రామిరెడ్డి

మహారాణిపేట: రోగుల ఆరోగ్యం, శ్రేయస్సులో కీలకపాత్ర పోషిస్తున్న వైద్యులు అభినందనీయులని జిల్లా మానసిక ఆరోగ్య సమీక్ష బోర్డ్ ఛైర్ పర్సన్ బి.రామారావు అన్నారు. రోగులకు స్వస్థత చేకూరేందుకు వారు అందిస్తున్న సేవలకు వెల కట్టలేమన్నారు. డాక్టర్స్ డేను పురస్కరించుకొని ప్రభుత్వ మానసిక వైద్యశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ అంకిత భావంతో సేవలు అందిస్తున్న వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో వైద్యుల సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో సైకియాట్రీ విభాగాధిపతి డాక్టర్ డి.విజయలక్ష్మి, ప్రొఫెసర్లు ఎస్.హరికృష్ణ, డాక్టర్ పి.లోకేశ్వరరెడ్డి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ ఎం.హైమవతి తదితరులు పాల్గొన్నారు.



ఎంవీపీ కాలనీలో డాక్టర్ ఫణీంద్రను సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఎంవీపీలో.. ఎంవీపీ కాలనీ: రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్లబ్ విశాఖపట్నం అధ్యక్షుడు మహ్మద్ యాసిన్, కార్యదర్శి చింతా నేతాజీ మాట్లాడుతూ వైద్యులు సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. కోవిడ్ వంటి విపత్తి సమయంలో డాక్టర్లు చేసిన సేవలను గుర్తుచేశారు. అనంతరం డాక్టర్ కె.ఫణీంద్రను ఘనంగా సత్కరించారు.



వైద్యులను సత్కరిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

వైద్యులకు సత్కారం

బీచ్ రోడ్డు: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సోమవారం వైఎంసీఏ ఆధ్వర్యంలో పలువురు వైద్యులను సత్కరించారు. వైఎంసీఏ అధ్యక్షుడు డి.కె.కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ పాల్గొని వైద్య రంగంలో విశేష సేవలందించిన డాక్టర్ అంజిలి, డాక్టర్ ఎం.శాంతి ప్రభ, డాక్టర్ మహేంద్ర, డాక్టర్ ఆనంద మోహన్, డాక్టర్ సృజన, డాక్టర్ పూర్ణిమను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎంసీఏ జాతీయ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ విలియమ్స్, పీటర్, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

వారంలో ఒకరోజు ప్రజారవాణా వినియోగిద్దాం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



తన బంగ్లా నుంచి జీవీఎంసీకి సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. తన బంగ్లా నుంచి సోమవారం సైకిల్‌పై జీవీఎంసీకి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒకరోజు ప్రజా రవాణాను వినియోగించే నిర్ణయం మేరకు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం దానిని అమలు చేస్తున్నామన్నారు. ఎకో వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక చర్యలు చేపడుతోందని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అతిసారతో ఒక్కరూ చనిపోరాదు

డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : అతిసారతో ఒక్కరూ చనిపోరాదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొబ్బరితోట వద్ద స్టాప్ డయేరియాపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. అతిసార వ్యాధిని ఎలా గుర్తించాలి..?, ఎలా నివారించాలో..? తెలియజేశారు. వాంతులు, విరేచనాలు సంభవించినప్పుడు ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి ఓఆర్ఎస్ ద్రావణం ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. ఐదేళ్లలోపు పిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించడం, చేతులు శుభ్రంగా ఉంచడం, వ్యాధి నిరోధక టీకాలు తరచూ వేయించాలని సూచించారు.



సభలో ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్లు కె.పద్మావతి, కె.నాగరాజు, జీవీఎంసీ సీఎంహెచ్‌వో డాక్టర్ నరేష్ కుమార్, వివిధ విభాగాల డాక్టర్లు ఎస్.జీవన రాణి (జిల్లా టీకాల అధికారి), డాక్టర్ బి.ఉమావతి (నోడల్ అధికారి), జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వర రావు, డీపీవో శశిభూషణ్, శ్రీలత, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

'పరిష్కార వేదిక'కు 12 అర్జీలు



అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీరామమూర్తి

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 12 అర్జీలు అందాయి. తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జి.శ్రీరామ్మూర్తి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డీటీ త్రినాథ్, ఆర్ఐ ఇబ్రహీం, ఆర్ఐ, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే దోమల నియంత్రణ

మహారాణిపేట : డెంగ్యూ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి జగదాంబ జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు మాట్లాడుతూ దోమ కాటు వల్ల డెంగ్యూ సోకుతుందని, దీని నివారణ కోసం అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. అలాగే ప్రజల సహకారం లేకపోతే దోమల నివారణ సాధ్యం కాదన్నారు. డెంగ్యూ మీద అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. పగటి పూట కుట్టే దోమాల ద్వారా మాత్రమే డెంగ్యూ వ్యాధి సోకుతుందన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతి ప్రభ, జిల్లా మలేరియా అధికారి తులసిరాజ్, బి.నాగేశ్వరరావు, శశిభూషణ్, నాగభూషణం, వైద్య ఆరోగ్య సిబ్బంది, మున్సిపల్ ఆరోగ్య సిబ్బంది, మలేరియా సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

5న 'శతాక్షి కవితల సంపుటి' ఆవిష్కరణ

సీతంపేట: అరసం విశాఖ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కవి, ఆకాశవాణి పూర్వపు కార్యక్రమాధిపతి రొక్కం కామేశ్వరరావు రచించిన 'శతాక్షి కవితల సంపుటి' పుస్తకావిష్కరణ సభ జరుగుతుందని సంస్థ ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ ముఖ్య అతిథిగా పుస్తకావిష్కరణ, కె.జి.వేణు పుస్తక సమీక్ష చేస్తారని చెప్పారు. కవులు, రచయితలు, కళాకారులు, సాహితీవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

నేటి నుంచి డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు

డాబాగార్డెన్స్ : అల్లూరి 127వ జయంతోత్సవాలను పురస్కరించుకొని పాఠశాల పిల్లలు, కళాశాల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ప్రతినిధి దండు నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఈ నెల 2 నుంచి 4 వరకు పోటీలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు మరిన్ని వివరాలకు 94907 50661లో సంప్రదించాలని సూచించారు.

భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార : భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం, మోటార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారతీయ న్యాయ సంహిత – 2023 పేరు మీద డిసెంబర్ 21న పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించిందని, దానికి రాష్ట్రపతి డిసెంబర్ 25న ఆమోద ముద్ర వేశారన్నారు. ఆ చట్టంలోని సెక్షన్ 106 (1, 2) ప్రకారం యాక్సిడెంట్ కేసుల్లో డ్రైవర్లకి 7 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం వుందని, ఇది అత్యంత ప్రమాదకరమన్నారు. దీనిని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తుందని, తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ చట్టం డ్రైవర్లను తీవ్ర అసంతృప్తి, ఆందోళనకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, వివిధ ఆటో స్టాండ్ల నాయకులు పాల్గొన్నారు.